


# ఇది స్ట్రీకింగ్ కాదు

'అరె! స్ట్రీకింగ్!!' అన్నారెవరో పక్కనున్న పార్కులోంచి.

'ఏది? ఎక్కడ? ఎవరు?' అంటూ పార్కులోంచి జనం అంతా రోడ్డుమీది కొచ్చేశారు.

ఒక సన్నటి పొడుగాటి అమ్మాయి రోడ్డు వెంబడి నగ్నంగా పరుగెడుతూంది. ఆమె రాగి రంగు పొడుగాటి జుట్టు గాలిలో పాయలుగా తేలుతూంటే, సాయంత్రపు నీరెండలో ఆమె నల్లటి దేహం కిలుం పట్టిన కంచుపోత విగ్రహంలా, ప్రాణం వచ్చి పరుగెడుతూన్న వీనస్ విగ్రహంలా కన్పిస్తూంది.

మెయిన్ రోడ్డు మీది ట్రాఫిక్ అంతా ఎక్కడిది అక్కడే నిలిచిపోయింది. కార్ల హారన్‌లూ, రిక్షాల గణగణలూ, సైకిళ్ళ గంటలూ... అంతా కోలాహలంగా వుంది. ఆ అమ్మాయి మనసుకి ఇవేం పట్టినట్లు

లేదు. అలా మెషీన్‌లాగ పరుగెడుతూనే వుంది. పరుగెత్తి పరుగెత్తి ఒకచోట రోడ్డు దిగి కుడివైపు తాటి తోపులోంచి అడ్డంపడి అవతల ఫర్లాంగు దూరంలోవున్న ఒక గుడిసెలో దూరిపోయింది.

* * *

రాత్రింతా నిద్దర్లేదు సీతాలుకి. తెల్లారితే మావ వస్తాడు. అతని ఆలోచనలతో మనసంతా నింపుకుని తెల్లవార్లూ మేలుకుని గంటలు లెక్కపెడుతూ కూర్చుంది.

రెండేళ్ళ క్రితం పొట్ట చేత్తోపట్టుకుని పట్నం వెళ్ళిపోయాడు రావుడు మావ. ఆ పోవటం పోవటం మళ్ళీ ఈవేళే తిరిగిరావటం. అదీ ఊరికే రావటం కాదు. సీతాలును పెళ్ళాడి వెంటబెట్టుకుని పోవటానికే వస్తున్నాడు. ఆ మాట తెలియగానే బాధలన్నీ తీరిపోయినట్లనిపించింది సీతాలుకు. ఇంక తాశీల్దారుగారింట్లో ఎముకలు విరిగేలా చాకిరీ చెయ్యనక్కర్లేదు. వాళ్ళింట్లో తోటమాలి దగ్గర్నుంచి వయసు మళ్ళిన వారి అన్నగారి వరకూ ప్రతివాడూ చేసే వెకిలి చేష్టలకూ, విసిరే ఛలోక్తులకూ మూగదానిలా పడి ఉండవలసిన పనిలేదు. ఆ తాశీల్దారుగారి చిన్న కొడుకు వేలెడులేడు తన్నుచూసి కన్నుకొడతాడు! లేకుంటే కుక్కను మీదికి ఉసికొల్పుతాడు. ఛీ! వెధవ బ్రతుకులు!! పేదాడి కడుపున పుట్టటమే మహా పాపంలాగుంది. ఇంకేంలే .... ఈ పీడ విరగడైపోతుంది. పెళ్ళిచేసుకుని మావ పట్నం తీసుకుపోతాడు. పట్నంలో ఎన్ని వింతలు, ఏడ్డూరాలు ఉంటాయో! ఇంజను లేకుండానే పరుగెత్తె రైళ్ళు, మేడ బస్సులూ ఉంటాయంట. ఓహో! బలే చూడొచ్చు!! ఇంతకీ .. మావకి ఏం పనో అక్కడ? ఏమైతే తనకేం. తన పని వంటచేసి పెట్టటమేగా! తాశీల్దారుగారి పెళ్ళాంలా

తనూ ఇంట్లోనే వుండొచ్చు. ఉదయమే లేచి వంటపని చేస్తుంది. మావ(కి పెట్టి టిఫిన్ డబ్బా చేతికిస్తుంది. సాయంత్రం మళ్ళీ తిరిగి వచ్చేటప్పటికి పనులన్నీ ముగించేసుకుని స్నానంచేసి, తల దువ్వుకుని కొప్పునిండా దోసెడు మల్లెపూలు ముడుచుకుని మావ(కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. మావ( రాగానే ఇంచక్కా తాశీల్దారుగారి కొడుకు, కోడల్లా చేతులు పట్టుకుని షికారుకు పోతారు. రాత్రికి ఎప్పుడో తిరిగొచ్చి ఇద్దరూ ఒకే కంచంలో తిని, ఆ తరవాత.... ఆలోచించలేక పోయింది సీతాలు. ఆమెకు తెలియకుండానే పెదాలు అలవోకగా సాగి సిగ్గుతో కూడిన తెలినవ్వు ముఖాన్ని తెరలు తెరలుగా తేజోవంతం చేశాయి.

ఇదంతా కనిపెడుతున్న పొరుగింటి చల్లాలు ఇక ఊరుకోలేక పోయింది.

'ఏంటే పిల్లా, నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?' అనడిగింది.

సీతాలు తడబడింది. క్షణంపాటు తొట్రుపడి, 'ఏం లేదప్పా, ఊకె నవ్వొచ్చింది' అంది.

'ఓసూరుకోవె, అబద్దాలకోరూ! నవ్వాకె వత్తదేంటొలె!! ఏదో కమ్మని కతే ఉండాల. ఏమే సీతాలూ, తాశీల్దారుగారి కొడుకేమైనా కన్నేశాడేంటి?'

'తూ, తూ ... నీ పాడుబుద్ధులు పోనిచ్చుకున్నావుగావు.'

'మరేంటో సెప్పరాదంటె.'

'మరే.... మరే.... మావ( గేపకం వచ్చాడప్పా. ఇయాలొత్త న్నాడుగందా!'

'ఏంటేంటి!! రావు( డొత్తన్నాడా? మరలా సెప్పవే. అందు తన్నమాట ఈ కులుకు?'

సీతాలు సిగ్గుతో ముడుచుకుపోయింది. ఆమె నెవరో గిలిగింతలు పెడుతున్నట్లూ, ఒంటినిండా పన్నీరు చిలకరిస్తున్నట్లూ అనిపించింది. సీతాలును అలా చూస్తూ నిలబడిపోయింది చల్లాలు. ఆమె సంబరం చూస్తూఉంటే గతానుభూతులన్నీ పెల్లుబికి వచ్చాయి చల్లాలుకు.

తనను చిన్నప్పుడే పెళ్ళాడి భర్త బర్మా వెళ్ళిపోయాడు. అయిదు సంవత్సరాల తరవాత తిరిగి దేశం వస్తున్నాడని తెలిసినప్పుడు మబ్బుకి మైమరిచి ఆడే నెమలిలా గంతులు వేసింది ఆమె మనసు. ప్రపంచం అంతా ఒక నందనవనంగా, అందులో తనూ, భర్తా—ఇద్దరే తిరుగుతూ ఆనందాన్ని చేదుకుంటున్నట్లూ... అనిపించేది. కాని, అతను వచ్చేటప్పటికి కాస్త అందంగా కన్పించాలనిగాని, అలంకరించుకుని అతణ్ని తనవైపు ఆకర్షించుకోవాలనిగానీ ఆ వయసులో తెలియలేదు. చెప్పిన వాళ్ళూ లేరు. బర్మాలో వయారి భామల విలాసాలు మరిగిన అతడు తనను కన్నెత్తి చూడకుండానే తిరిగి బర్మా వెళ్ళిపోయాడు. అక్కడే మరో పెళ్ళి చేసుకుని పిల్లల్నికంటూ స్థిరపడిపోయాడు. అతనికోసం ఎంతగా నిరీక్షించింది! ఏళ్ళ తరబడి శూన్యమైన ఒంటరి బ్రతుకు బ్రతికింది.

ఒక రోజున ఒంటరిగా ఇంట్లో కూర్చొని ఆలోచనల్లో తేలుతూంది. ఎంత ప్రయత్నించినా ఎందుకో ఆ రోజున కోర్కెలకు కళ్ళేలు వెయ్యలేక పోయింది. వయసూ.... ఒంటరితనమూ ఏకమై తన్ను చిత్రవధ చేస్తూఉంటే భౌతిక వాంఛల్ని నిరసించలేకపోయింది. ఆలోచనలు ఎక్కడెక్కడికో రెక్కలొచ్చి ఎగిరిపోసాగాయి. అలాంటి సమయంలో అకస్మాత్తుగా తడికె తోసుకుని లోపలికొచ్చాడు సత్తెయ్య.

'ఇదేంటి మావా! ఇంత రాతిరేలొచ్చావు' అంది తడబడుతూ.

'రాతిరేలని నువ్వే సెపుతున్నావు గందా! మరెందుకొచ్చానో ఎరికలేదేంటే, చల్లాలూ....'

'పరాసకాలకేంగాని, యెల్లిపో, మావాఁ ఎవురైనా సూత్తె బాగుండదు.'

'సూత్తె యేఁవే! బయమా.... పెళ్ళి సేసుకుందాం.'

'అలాంటి మాటలు మాట్లాడకు మావాఁ. నాను పెళ్ళయిందాన్ని.'

'అఁ.... అయింది పెళ్ళి. నీదీ ఓ పెళ్ళేనా! ఆ దేనాడైనా నిన్ను ముట్టుకున్నాడంటే, చల్లాలూ. పిచ్చి సన్నాసి! నీకేం పెపంచకం తెలిసినట్టులేదు. ఆ దక్కడ ఆయిగా పెళ్ళాంతో కాపరం సేత్తా ఉంటే, నువ్విక్కడ ఇంట్లో పడుకుని కనిపించని ఆకాసంలో సుక్కలు లెక్కెడతా.... గుటకలు మింగుతా.... కూకుంటె కోరికలు తీరుతా యంటె? ఇంకెంతకాలం ఆడికోసం సూత్తావుగాని, మనం పెళ్ళిసేసుకుందాం, రాయే' అనడిగాడు సత్తెయ్య.

ఇంకో అప్పుడైతే ఏమనేదోగాని, ఆ సమయంలో మాత్రం సత్తెయ్య చెప్పిన ప్రతి మాటా సత్యంలా అనిపించింది చల్లాలుకు. అసలే వేడిమీదుందేమో—

'నిజంగా నన్ను పెళ్ళిచేసుకుంటావా, మావాఁ' అనడిగేసింది.

'నిజవేఁనే .. నీ మీద. . ఛఛ... నామీద ఒట్టే.'

ఆశైన వాణ్ణి కాదనలేకపోయింది చల్లాలు. అవసరం తీరాక మళ్ళి కనిపించలేదు సత్తెయ్య. తను తల్లిని కాబోతున్నానని తెలిశాక రాత్రికి రాత్రే ఊరొదిలి ఇక్కడికొచ్చేసింది. ఈ సమాజంలో ఆడదానికి ఒంటరి బతుకు సాధ్యం కాదనీ తెలిశాక, రోజు కొకణ్ణి జంటగా తెచ్చుకుని కాలక్షేపం చేస్తోంది. ఈ దుర్గతికి కారణం ఆనాడు తన భర్తని ఆకర్షించుకోలేక పోవటమేనని ఇప్పటికీ వాపోతూ ఉంటుంది.

'ఇంకా అలాగే కూచున్నావేమే. పోయి కాసిని నీళ్ళోసుకునీ గుంజుమన్న తెల్లకోక కట్టుకుని ఆ డొచ్చే యేలకి అందంగా తయారవ్వు. అసలే పట్నంలో తిరుగుతున్నాడు.'

సీతాలు ఏమీ మాట్లాడలేదు.

'ఏవేఁ... గుడ్డల్లేవా యేంటే?.'

'ఉహుఁ .... లేవు' అంది టీనంగా.

'రైకయితే లేదుగానీ, మాంచి కోకోటి ఉంటి, ఇచ్చేదా?'

'ఒద్దోలప్పా. అసలే నీ కోకలు పుంచి గుంటయి, మైలయి పోతయి.'

'గుడ్డ మైలవకుండుంట దేంటే? పోనైతే అవుతటి. ఇయాల నీ మొగు డెలాగూ సీర లెత్తొత్తాడుగా, నా కోటిద్దువులే!'

ఆ పేటలో రవిక తొడుక్కునే ఆడటి చల్లాతే. తక్కిన వాళ్ళంతా ఏదో ఉతుక గుడ్డ మొలకి చుట్టుకుని మెడ చుట్టూ తిప్పుకుంటారు. దాని శక్తిని బట్టి వాళ్ళ ఆడతనాన్ని దాస్తే దాస్తుంటి, లేకుంటే లేదు.

సీతాలు శుభ్రంగా తలంటి పోసుకుంటి. చల్లాలిచ్చిన దువ్వెనతో నున్నగా తల దువ్వుకుని ముడెట్టుకుంటి. చల్లాలిచ్చిన కోకే కట్టుకుని రోజంతా రాబోయే తన మావఁ కోసం ఎదురుచూసింటి.

కాని, ఆ మావఁ ఎంతకీ రాలేదు.

పొద్దు వాలుతూంటి. అవతల తాశిల్దారు గారింట్లో బండెడు అంట్లు తనకోసం ఎదురు చూస్తూ ఉంటాయి. వేగిరం వెళ్ళకపోతే ఆ ఇంటావిడే కాట్ల కుక్కలా మీద పడుతుంటి.

విసిగి ఇక చీర విప్పేసే ప్రయత్నంలో ఉంటి.

'ఏమే సీతాలూ, రాలేదా?' అంటూ వచ్చింది చల్లాలు.

'ఊహుం....' అంది నీరసంగా.

'మరి సీర ఇప్పేత్తావేమే?'

'మరేం జెయ్యాల! పని కెల్లొద్దంటి.'

'ఎల్తే ఎల్లు. కోక విప్పుతావెందుకే? ఆ సీరలో నువ్వు రంభ లాగున్నావు. నిన్నెవుడూ ఎగరేసుకుపోళ్ళే ఇయ్యాల్టి కలాగే ఎల్లు' అని సాగనంపింది చల్లాలు.

* * *

ఆహారం చిక్కని ఆడ పులిలా చిందులు తొక్కుతోంది తాశిల్దారుగారి సతీమణి. కొడుకూ, కోడలూ పార్కుకు షికారు కెళ్ళే వేళయింది. వాళ్ళకి కాస్త టిఫెన్ చేసి పెట్టి పంపించాలి. సీతాలు ఇంకా అంట్లు కడగలేదు. ఆమెకోసం దారికాసుకు కూర్చుంది.

సీతాలు కంటబడగానే — 'వచ్చావా, తల్లీ .... నువ్వో రాజకుమారివై పోయావే.... ఏమే ఎవడైనా ఎగరేసుకుపోయి ఇప్పుడొదిలాడా...' అంటూ మొదలెట్టింది.

సీతాలు మాట్లాడకుండా దొడ్డివైపు కుళాయి దగ్గరి కెళ్ళిపోయింది. ఆడ పులికి ఆకలి తీరినట్లు లేదు. ఆమె వెనకే దొడ్లోకి నడిచింది.

'ఏమే.... కొత్తచీర కట్టుకుని మంచి గుమ్ముగా ఉన్నావు ఏమిటి కత? అరె!!! ఒసేవ్, అమ్మాయ్!.... రమా.... రావే... ఇటు రావే, తల్లీ' అంటూ గావుకేక పెట్టింది.

'ఏమిటండి, అత్తయ్యా.'

'చూడు, రమా.... సరిగా చూడు.... దాని ఒంటిమీది చీర నీది కాదూ?'

'అవునండ త్తయ్యా! ఆ చీర నాదే.'

'ఏమే ... ఎంత ధైర్యమే నీకు? నా ఇంట్లో చీర కాజేసి నాజూగ్గా కట్టుకుని నా దగ్గరికే వచ్చావు?'

'కాదండి, అమ్మగారూ.... ఈ సీర మీది కాదుండి' అంది సీతాలు కంగారుగా.

'మరెవరిదే? నీ కెక్కణ్ణుంచొచ్చిందో చెప్పు.'

'మరేనండీ.... మరీ....' అంటూ నసిగింది. దానితో వాళ్ళ అనుమానాలు మరింత బలపడ్డాయి.

'దొంగ ముండా... వారం రోజుల్నుంచి చీర పోయిందని మొత్తుకుంటూఉంటే మూగిదాన్లా మాట్లాడక ఈవేళ చక్కగా సింగారించుకుని వచ్చావా?'

'కా దమ్మగారూ. నేను దొంగని కాదు.'

'ఇంకా బొంకుతా వెందుకే... రావే, అమ్మాయ్. దీనికి తగిన శాస్తి చెయ్యాలి...' అంటూ కొంగు పట్టుకుని లాగింది. అనాచ్ఛాదితంగా ఉన్న ఆమె యౌవనపు పొంగులన్నీ బయటపడ్డాయి.

సీతాలు రెండు చేతులూ అడ్డం పెట్టుకుని బతిమాలింది.

'వద్దు, తియ్యకండమ్మగారూ... ఈ కోక మీది కాదు... నేను దొంగని కాదు' అంటూ కాళ్ళు పట్టుకుంది.

ఒక్క తన్ను తన్నింది. కిందపడి దొర్లింది సీతాలు. అలా తన్ను తన్నుకూ దొర్లిస్తూ చీర లాగేసింది.

'అమ్మగారూ... మీకు దణ్ణం పెడతాను, ఒక గుడ్డ ముక్కయినా ఇప్పించండి తల్లీ. సిగ్గుతో సచ్చిపోతన్నా' అని ఏడ్చింది.

'ఏవిటీ సిగ్గేస్తుందంటే నీకు.. గుడ్డలివ్వాలా ... మా తల్లే... ఒరేయ్ వెంకన్నా!'

'అమ్మగారూ.... వద్దు.... వద్దు. మొగోణ్ని పిలవకండి....' అంటుండగానే పరుగెత్తుకొచ్చేశాడా పరమ విధేయుడు.

సీతాలు లేచి రివ్వున రోడ్డు వెంబడి పరుగు లంకించుకుంది.

*          *          *

గుడిసెలో గోనె పట్టామీదపడి తల నేలకేసి కొట్టుకుని ఏడ్చింది సీతాలు. ఏడ్చి ఏడ్చి అలిసి అలాగే పడుకుంది. బలమైన పొడుగాటి వేళ్ళు ఆమె వీపుమీద పాకగానే ఒక్క క్షణం తలఎత్తి చూసి గోనె పట్టా గబుక్కున కప్పుకుని భోరున ఏడ్చింది.

'లేదు మావాఁ, నేను కోక దొంగతనం చెయ్యలేదు. నేను దొంగను కాదు... నేను దొంగను కాదు...

రావుఁడు ఏం మాట్లాడకుండా ఆమెను పొదివి పట్టుకున్నాడు. ఒక్క క్షణం అతని ముఖంలోకి చూసి గుండెల్లో గువ్వలా అణిగి పోయింది ఏడుస్తూ.

ఇదంతా చూస్తూనే ఉంది చల్లాలు.

కథ అంతా తెలిశాక తాశీల్దారుగారి తోటమాలి ఆమె మనసులో మెదిలాడు.

'ఈడి జిమ్మడ. దొంగ సచ్చినోడు కన్నమేసిన కోక ఇత్తాడా నాకు...' అంటూ వెనక్కి తిరిగి రయ్యిన వీథిలో కెళ్ళిపోయింది.

★